స్వచ్ఛాంధ్ర.. ప్రచారానికే పరిమితం!

●అపరిశుభ్రతకు నిలయంగా మున్సిపల్ కార్యాలయం ●దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకోని అధికారులు


ఎంఈ చాంబర్ వెనుక అపరిశుభ్రత


మరమ్మతులకు నోచుకోని ఫ్రిడ్జ్, సింటెక్స్ ట్యాంక్


బాల్కనీలో పడేసిన స్క్రాప్‌తో అపరిశుభ్రంగా పరిసరాలు

గుంతకల్లుటౌన్: పైన పటారం..లోన లొటారం అన్న చందంగా మారింది మున్సిపల్ కార్యాలయ పరిస్థితి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ గుంతకల్లు నిర్మాణానికి పాటు పడాలంటూ ప్రతి నెలా మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' పేరిట అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలకు సందేశాలిస్తున్న మున్సిపల్ అధికారులు.. వారు పనిచేసే మున్సిపల్ కార్యాలయ ఆవరణాన్ని శుభ్రంగా ఉంచుకోవడంలో మాత్రం విఫలమయ్యారు. ఎదుటోడికి చెప్పడానికే నీతులు..తప్ప తమకేమీ వర్తించవన్నట్లు వారు వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకెళితే.. మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ సెక్షన్ వద్దకు వెళ్లగానే తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చాంబర్ వెనుక గతంలో నిర్మించిన టాయిలెట్లు పూర్తిగా పగిలిపోయి నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ఎంఈ చాంబర్‌కు ఆనుకుని ఉన్న టాయిలెట్ల నుంచి వచ్చే మురుగు వెళ్లడానికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో.. అక్కడే నిల్వ ఉండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారిపోయాయి. కార్యాలయ సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్లను రోడ్డు వెంబడి వెళ్లే వారితో పాటు ఆఫీసు చుట్టుపక్కన ఉన్న దుకాణదారులంతా వినియోగిస్తుండటంతో ఇంజినీరింగ్ సెక్షన్ వద్ద తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది.

పనిచేయని ఫ్రిడ్జ్

కార్యాలయానికి పన్ను చెల్లింపుదారులతో పాటు ఏదైనా పనిమీద వచ్చే ప్రజలకు తాగునీరు ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇంజినీరింగ్ సెక్షన్‌కు ఆనుకుని గతంలో వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ఫ్రిడ్జ్ కూడా చుక్క నీరందివ్వడం లేదు. ఐదారేళ్లుగా ఆ ఫ్రిడ్జ్‌ను మరమ్మత్తులు చేయించే వారే లేరు. అలాగే దాని పక్కనే చేతులు కడుక్కోవడానికి మెప్మా వారు ఏర్పాటు చేసి సింటెక్స్ ట్యాంక్ కూడా వినియోగంలో లేదు. ఇక చైర్‌పర్సన్ చాంబర్ పక్కనున్న బాలనీలో నిరుపయోగమైన గుజురీ సామాన్లు మొత్తం అక్కడే పడేశారు. వినియోగంలో లేని జిరాక్స్ మిషన్, విరిగిన కుర్చీలు, అల్యూమినియం షీట్లతో పాటు చెత్తా చెదారంతో ఆ పరిసరాలు గలీజుగా మారాయి. రెవెన్యూ సెక్షన్ వద్ద లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన రోడ్డు స్వీపింగ్ మిషన్‌ను మరమ్మతులు చేయించకుండా మూలనపడేశారు. ఇక కార్యాలయ ఆవరణలోని అన్న క్యాంటీన్ నుంచి వెలువడే వ్యర్థాలు, మురుగునీటితో డ్రైనేజీ నిండినప్పుడల్లా ఆ మురుగంతా లైటింగ్ సెక్షన్ వద్దకు వచ్చి ఆగుతోంది. ఇప్పటికైనా అధికారులు మున్సిపల్ కార్యాలయాన్ని శుభ్రం చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా కలశాభిషేకం


కలశ పూజ నిర్వహిస్తున్న వేదపండితులు

గుంతకల్లుటౌన్: వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో విశేష కలశాభిషేక పూజలను నిర్వహించారు. ఆలయ వేదపండితులు భక్తాదుల చేత కలశ పూజ చేయించి అమ్మవారి పాదాలకు అభిషేకం చేశారు. అలాగే వాసవీ మహిళా మండలి వారిచే శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం, భక్తిగీతాలాపన, కోలాటం ప్రదర్శన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని మండల, మండలేతర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు శనివారం కోరారు. బెంగుళూరు శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించే శిబిరంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకూ కంటి పరీక్షలు చేస్తారన్నారు. శిబిరానికి హాజరైయ్యేవారు ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌ఫోటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం 9440550000 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

నెట్టికంటుడికి రూ.1.62 లక్షల విరాళం


దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ కె.వాణి

గుంతకల్లు రూరల్: సత్యసాయి జిల్లా గోరంట్ల మండల కేంద్రానికి చెందిన భక్తులు వి.నిరంజన్, వి.పవన్‌కుమార్ శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.1.62 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి విరాళం అందజేస్తున్నట్లు తెలిపిన దాతలు.. నగదును ఈఓ కె.వాణికి అందజేశారు. ఈసందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం వారికి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

శుభకార్యం

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గంలో శనివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ద.మ. రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయ్‌కుమార్ కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే వైటీ.చెరువులో జరిగిన పెద్దొడ్డి నాగరాజు కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వైవీఆర్‌తో పాటు రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి మస్తాన్‌వలి, పార్టీ నాయకులు దశరథరెడ్డి, కాకర్ల నాగేశ్వరరావు, తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఖత్నా


ఖత్నా చేయించుకున్న బాలురికి పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 40 మంది పేద ముస్లిం బాలురకు ఉచితంగా ఖత్నా(సున్తీ) చేయించారు. శనివారం అంజుమన్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఖత్నాలు చేయించుకున్న పిల్లలకు లుంగీ, పౌష్టికాహారం కిట్లు, మందులను కమిటీ తరపున ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, గౌరవాధ్యక్షుడు రహిమాన్, సభ్యులు వలిబాషా, ఆర్‌డీజీ బాషా, గుజిరి రఫీ, నూర్‌బాషా, అఫ్రోజ్, అష్రఫ్, అస్లామ్, నూర్ మొహమ్మద్, వైద్యుడు ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడికి నివాళి

గుత్తి: గుత్తి పట్టణంలోని హంపన్న పార్క్‌లో శనివారం వర్ధంతి సందర్భంగా సీపీఐ నాయకుడు రాముకు ఆ పార్టీ నాయకులు నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రామదాసు, రాజు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, నాయకులు మహమూద్, సూర్యనారాయణరెడ్డి, రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కోట అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి


మాట్లాడుతున్న గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు

గుత్తి: చారిత్రాత్మకమైన గుత్తి కోట అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని గుత్తి కోట సంరక్షణ సమితి జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. గుత్తి కోట వద్ద శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. గుత్తి కోటను అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగి ఆదాయం లభిస్తుందన్నారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో గుత్తి కోటకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి పాటు పడతామని హామీలు గుప్పించారన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే నిధులు కేటాయించి కోట అభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు కాశీరావు, సీతారామిరెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

రేపు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని వాటర్‌వర్క్స్ రోడ్డు వద్ద ఉన్న రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఏర్పాటు చేశామని నిర్వాహకులు శనివారం తెలిపారు. సత్యనారాయణ వ్రతానికి పెద్దఎత్తున భక్తులు హాజరు కావాలన్నారు.

వీర జవాన్‌కు ఘన నివాళి


గుత్తిలో వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


గేట్స్ కళాశాలలో వీర జవాన్ మురళి నాయక్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం


తాడిపత్రిలో వీర జవాన్ మురళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గుత్తి/తాడిపత్రి రూరల్/శింగనమల/యాడికి: దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ త్యాగాన్ని భారతజాతి ఎప్పటికీ మరచిపోదని గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి అన్నారు. గుత్తి లోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం మురళి నాయక్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీర జవాన్ మురళి నాయక్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● గుత్తి పట్టణంలోని హంపన్న పార్క్‌లో శనివారం మురళినాయక్‌కు సీపీఐ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ నాయకులు రామదాసు, రాజు, వీర భద్ర స్వామి, మహమూదా, రమేష్, షఫి, సూర్యనారాయణ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు అంజన్ ప్రసాద్, బీఎస్పీ నాయకులు గద్దల మస్తానప్ప పాల్గొన్నారు.


శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

● తాడిపత్రి పట్టణంలోని నంద్యాలరోడ్డులో శనివారం వీర జవాన్ మురళినాయక్ చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, నాయకులు నారాయణరెడ్డి, గోపాలక్రిష్ణ,చిన్ని క్రిష్ణుడు, చిన్న కుళ్లాయప్ప, రామాంజి, లోక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

● శింగనమలలో జవాన్ మురళీ నాయక్‌ను స్మరించుకుంటూ యువకులు జాతీయ జెండాలు పట్టి, కొవ్వొత్తులతో శనివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. యువకులు మురళీ అమర్‌హై అంటూ నినాదాలు చేసుకుంటూ గ్రామంలో ర్యాలీ చేశారు.

● యాడికి మండల కేంద్రంలోని కోన రోడ్డులో ఉన్న పీపుల్స్ హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో అమరుడైన జవాన్ మురళి నాయక్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మానవ హక్కుల కమిటీ స్టేట్ జనరల్ సెక్రటరీ నారాయణ స్వామి, చంద్రశేఖర్, శివ హరి, నీలకంఠ, చంద్రమౌళి, ఓబులేసు, రామిరెడ్డి, ప్రసాద్, శివకోటి, శివ ప్రసాద్, లక్ష్మీనారాయణ తిరుమలేసు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలి



శ్రీవారి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం, పామిడి భోగేశ్వరాలయంలో పూజలు

గుంతకల్లుటౌన్: ఆపరేషన్ సిందూర్ పేరిట చేస్తున్న యుద్ధంలో విజయం సాధించేలా భారత సైన్యానికి శక్తియుక్తులు ప్రసాదించాలని వేంకటేశ్వరస్వామికి బీజేపీ నాయకులు పూజలు చేశారు. శనివారం రాజేంద్రనగర్‌లోని శ్రీవారి ఆలయంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ ఆధ్వర్యంలో భరతమాత పేరిట అర్చన చేయించారు. యుద్ధంలో వీర మరణం పొందిన సైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పురంధర్, కొలిమి శేఖన్న, శ్రీనివాసులు, సతీష్‌చౌదరి, ఎంకే.సురేష్, శ్రీరాములు, తిమ్మప్ప, రామాంజినేయులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో హిందూధార్మిక సంఘాల ఆధ్వర్యంలో భోగేశ్వరునికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భారత్-పాక్ యుద్ధ నేపథ్యంలో భారత్‌కు విజయం ప్రాప్తించాలంటూ భక్తిప్రపత్తులతో వారు భోగేశ్వరుని పూజించారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు, కవి కే నారాయణ మూర్తి, అంజినాయక్, కుమారస్వామి, మల్లికార్జున ఆచారి, పోతురాయి భాస్కర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఉద్యోగుల సంఘం ఎన్నికలు


తాడిపత్రిలో ఎన్నికైన వారిని సన్మానిస్తున్న దృశ్యం


ఎన్నికైన శింగనమల తాలుకా ఉద్యోగులు

తాడిపత్రిటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాడిపత్రి తాలూకా అధ్యక్షుడిగా హర్షవర్ధన్ ఎన్నియ్యారు. తాడిపత్రి పట్టణంలోని కర్నూల్ వెంచర్‌లో ఉన్న రైతు సేవా కేంద్రంలో శనివారం ఉద్యోగ సంఘం ఎన్నికలు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీక్రిష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి తాలూకా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా హర్షవర్ధన్, సెక్రటరీగా వెంకట క్రిష్ణయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా క్రిష్ణమోహన్‌బాబు, ట్రెజరర్‌గా రాంగోపాల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మహేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులుగా హరిక్రిష్ణ, శర్మాస్‌వలి, ఉమాదేవి, హైమావతి, బాబు ఎన్నికయ్యారు.

శింగనమల: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శింగనమల తాలుకా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం శింగనమలలోని తహసీల్దార్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శింగనమల తాలుకా శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా వేణుగోపాల్, సహాయ ఎన్నికల అధికారిగా కేసీ నాగరాజు వ్యవహరించారు. శింగనమల తాలుకా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా శ్రీరాములు, సహాయ అధ్యక్షుడిగా వి.పవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వి. అశ్వర్థనారాయణ, కె.నారాయణరెడ్డి, ఆర్.భాగ్యశ్రీ, కార్యదర్శిగా ఎం.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా రియాజ్ బాషా, ఎం.సుధాకర్, పి.సునాలిని, ఎ.అంజలి తదితరులు ఎన్నికయ్యారు.

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ బృందం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణ అధికారులుగా వేణుగోపాల్, కేసీ నాగరాజు వ్యవహరించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుత్తి తాలూకా అధ్యక్షుడిగా సి.ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శిగా కె.ఆదినారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా వి.ఇమామ్ హుస్సేన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.నాగరాజు, ఉపాధ్యక్షులుగా బి.లోకేష్, జి.సురేష్‌బాబు, కె.టి.వెంకటకృష్ణారావు, జె.శివకుమారి, సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఎస్.చంద్ర, ఎస్.రవికుమార్ రెడ్డి, ఆర్.సంజీవరాయుడు, నిరీష, టి.అబ్దుల్ మెహరాజ్, వి.రవికుమార్, రమేష్‌బాబు తదితరులను ఎన్నుకున్నారు.


గుత్తిలో ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

వైభవంగా బండిశూల తిరునాల


సుంకులమ్మ ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


సురబండిని ఎద్దులతో లాగిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు/పామిడి: పామిడి మండలం రామరాజుపల్లి, పెద్దవడుగూరు మండలంలోని కాశేపల్లి, గుత్తి అనంతపురం గ్రామాల సమక్షంలో నిర్వహిస్తున్న బండిశిల తిరునాల ఘనంగా కొనసాగుతోంది. వేలాది మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అమ్మవారి సురబండి నిలాగించే కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు తమ ఎద్దులతో పన్నారపు బండ్లు కట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఇలా చేయడం వల్ల పంటలు బాగా పండడంతోపాటు ఎద్దులకు ఎలాంటి రోగాలు రావన్న ప్రగాఢ నమ్మకం. అలాగే కొందరు భక్తులు తమ వాహనాలను ఆలయం చుట్టూ తిప్పారు. ఈ సందర్భంగా ఆలయ సమీపంలో గాజుల అంగళ్లు, తినుబండారాల అంగళ్లు, చిన్న పిల్లలు ఎగిరే నెట్ జంప్‌లు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్త ఎంపికకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈఓ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఈఓ మాట్లాడుతూ హిందూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆసక్తి ఉన్న వ్యక్తులు ఆలయ ధర్మకర్త ఎంపిక కోసం 20 రోజుల్లో అనంతపురంలోని దేవదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

నేడు, రేపు అక్కమ్మగార్ల పరుష

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురం గ్రామంలో ఆదివారం, సోమవారం అక్కమ్మగార్ల పరుష నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. గ్రామంలో ఆదివారం అక్కమ్మ గార్ల దేవాలయం ఎదుట అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ చివర ఉన్న కొండమీద ఉన్న స్వాములను రెడ్డిపల్లి కొత్తబావి దగ్గరకు ఊరేగింపుగా తీసుకెళ్తామన్నారు. సోమవారం తెల్లవారుజామున 4కు కొత్తబావి నుంచి జలధికి స్వాములు వస్తాయన్నారు.సాయంత్రం 5 గంటలకు స్వాములను ఊరేగిస్తామన్నారు.

గడ్డివామి దగ్ధం

పెద్దవడుగూరు: మండలంలోని లక్ష్ముంపల్లిలో రైతు చిన్న సుబ్బయ్యకు చెందిన గడ్డివాము అగ్నికి ఆహుతైన సంఘటన శనివారం చోటు చేసుకొంది. వివరాలు .. రైతు వేరుశనగ పొట్టు కొనుగోలు చేసి వామి వేసుకున్నాడు. శనివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతం లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. ఫైర్ ఇంజన్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. రూ. రెండు లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే కేసులు

యల్లనూరు: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. శనివారం తిరుమలాపురం క్రాస్ వద్ద వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే చిన్న పిల్లలతో డ్రైవింగ్ చేయిస్తే చర్యలు తీసుకుంటాన్నారు. ఈ సందర్భంగా 20 వాహనాలకు అపరాధ రుసుం విధించినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

హోటల్‌లో చోరీ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని నార్పల క్రాసింగ్‌లో ఉన్న వినాయక హోటల్‌లో చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. నార్పల క్రాసింగ్‌లో ప్రభు యాదవ్ అనే వ్యక్తి వినాయక హోటల్‌ను నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఆయన హోటల్ బంద్ చేసుకుని ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో హోటల్ వెనుక రేకులు తొలగించి హోటల్‌లోకి ప్రవేశించి క్యాష్ బాక్స్‌లో ఉన్న రూ.50 వేలు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఉదయాన్నే హోటల్‌కు వెళ్లగా చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఇళ్ల మధ్యన, రోడ్డు పక్కనే ఎలాంటి కంచె లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. పిల్లలు ఆడుకునే సమయంలో ప్రమాదం జరిగే అవకాశముందని కాలనీవాసులు వాపోతున్నారు. కంచె ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు కాలనీవాసులు విన్నవించారు. అయినా స్పందన లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు.



గుంతకల్లు: పట్టణంలోని హనుమేష్‌నగర్‌లోని రోటరీ హైస్కూల్ వెళ్లే రహదారిలోని ఉలగమ్మగుడి వద్ద కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కాలవపై నిర్మించిన కల్వర్టు దెబ్బతినడంతో నాపబండలు వేశారు. నిత్యం కల్వర్టుపై ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు వెళ్తుంటాయి. వాహనాల రాకపోకలు ఎక్కువ కావడంతో నాప బండాలు లూజుగా మారాయి. దీంతో ఏ సమయంలోనైనా బండలు కుంగిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సమస్యల పరిష్కరించాలని ప్రజలు కోరారు.